

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి



ప్రజాశక్తి - చాట్రాయి

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొమ్ము ఆనందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిన్నంపేటలో గిన్నెల చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలతో ఆనందం మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు రద్దు చేసిన అలవెన్సులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.వీర వెంకటేశ్వరరావు, కె.రాంపండు, ఘంటసాల పుల్లయ్య కూలీలు పాల్గొన్నారు.

అరకొర జీతం.. అన్ని పథకాలూ దూరం..!

స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వం వివక్ష
పిఎఫ్, పెన్షన్, పిఆర్‌సి వర్తింపు వంటివేమీ లేకుండానే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటన
రెండు జిల్లాల్లో ఏడు వేల మందికిపైగా అంగన్వాడీలు విలవిల
రూ.పది వేలు వేతనం తీసుకుంటున్న ఆశాలకూ పథకాల్లో కోత



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం. చిరుద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న మాటలు బూటకంగా మారిపోయాయి. ముఖ్యంగా అంగన్వాడీల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చాలీచాలని జీతాలు ఇస్తూ.. ప్రభుత్వ పథకాలు అందించకుండా నిలిపివేయడంతో జిల్లాలో ఏడు వేల మందికిపైగా అంగన్వాడీల పరిస్థితి దయనీయంగా మారింది. రూ.పది వేలు జీతం అందుకుంటున్న ఆశా వర్కర్లలోనూ చాలామందికి ప్రభుత్వ పథకాలు అందని దుస్థితి నెలకొంది.

అంగన్వాడీ ఉద్యోగులకు రూ.11 వేలు జీతం ఇస్తూ ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఇదే ఇబ్బందిగా మారే పరిస్థితి కన్పిస్తోంది. రెండు జిల్లాల్లో 7,372 మంది వరకూ అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు రూ.11 వేలు, ఆయాలకు రూ.ఏడు వేల చొప్పున ప్రతినెలా జీతం ఇస్తోంది. వీరంతా స్కీమ్ వర్కర్లు. ప్రభుత్వం మాత్రం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చెబుతూ ప్రభుత్వ పథకాలన్నీ నిలిపివేసింది. అంగన్వాడీ కుటుంబాల్లో వృద్ధులకు పెన్షన్‌గాని, కొత్త రేషన్‌కార్డులుగాని, అమ్మఒడి, ఇంటి స్థలాలు, చేయూత, పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఏ ఒక్క ప్రభుత్వ పథకం అమలు కావడం లేదు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా తిరస్కరిస్తున్న పరిస్థితి ఉంది. పెరిగిన ధరల ప్రకారం చూస్తే అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చే జీతం రూ.11 వేలు నెలలో సగం రోజులకు కూడా సరిపోని పరిస్థితి. మిగిలిన కుటుంబ సభ్యులు పనికెళ్లితే కుటుంబం ముందుకు సాగే పరిస్థితి. అలాంటి చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా తయారైంది. అంగన్వాడీలకు పిఎఫ్‌గాని, పెన్షన్, పిఆర్‌సి వర్తింపు వంటి ఏ ఒక్క సౌకర్యమూ ప్రభుత్వం ఇవ్వడం లేదు. అయితే ప్రభుత్వ ఉద్యోగులని చెప్పడం విస్మయపరుస్తోంది. రూ.50 వేలకుపైగా జీతం తీసుకుంటున్న ఉద్యోగుల తరహాలో అంగన్వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పిల్లలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ సైతం నిలిపివేయడంతో అంగన్వాడీ ఉద్యోగులు తమ పిల్లలను చదివించుకోలేని దుస్థితి నెలకొంది. ఉద్యోగ విరమణ పొందినా జాబితా నుంచి పేరు తొలగించకపోవడంతో వృద్ధాప్య పెన్షన్ సైతం అందుకోలేని దుస్థితిని ప్రభుత్వం సృష్టించింది. అంగన్వాడీలకు కనీస వేతన చట్టం సైతం వర్తింపజేయని ప్రభుత్వం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా ఏవిధంగా చెబుతుందో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను తగ్గించుకోవడం కోసం ఈ విధంగా చిరుద్యోగులైన అంగన్వాడీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.పది వేలు ఆదాయం, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు ఆదాయం కలిగిన వారికి పథకాలు వర్తించవని ప్రభుత్వం చెబుతోంది. మరి పట్టణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీలకు రూ.11 వేలు జీతమే అందుకుంటున్నా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదు. ప్రభుత్వం చెబుతున్న మాటలు బూటకమని క్షేత్రస్థాయి పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి.

ఆశా వర్కర్లకూ ప్రభుత్వ పథకాల కోత

రెండు జిల్లాల్లో మూడు వేల మంది వరకూ ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం రూ.3,760, రాష్ట్రప్రభుత్వం 7,200 మొత్తం రూ.పది వేల వరకూ వేతనంగా వస్తోంది. పది వేలు జీతం తీసుకుంటున్నారనే కారణంతో ఆశా వర్కర్లకు సైతం ప్రభుత్వ పథకాలు ఆపేస్తున్న పరిస్థితి ఉంది. గతంలో పథకాలు అందుకుంటున్న వర్కర్లకు మాత్రమే కొనసాగుతున్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకుంటే మాత్రం ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఆశా వర్కర్లలో సగం మందికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని తెలుస్తోంది. అంగన్వాడీ, ఆశాలు వంటి చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఇదే వైసిపికి పెద్ద ఎదురుదెబ్బ కానుందనే చర్చ రాజకీయంగా నడుస్తోంది.



తాగునీటి కోసం క్యూ కట్టిన మహిళలు

సింగన్నపల్లి పునరావాస కాలనీలో

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - పోలవరం

సింగన్నపల్లి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కొరుతూరు కాలనీ మహిళలు శనివారం డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తరామయ్యపేట పునరావాస కాలనీ శివారున ఉన్న సింగనపల్లి గిరిజనేతరుల పునరావాస కాలనీలో సత్యసాయి తాగునీటి కోసం మధ్యాహ్నం మూడు గంటలకు మహిళలు క్యూ కట్టారు. ఈ సందర్భంగా సింగనపల్లి గ్రామ మహిళలు మాట్లాడుతూ నిత్యం మధ్యాహ్నం మూడు గంటలకు కేవలం అరగంట మాత్రమే సత్యసాయి తాగునీటి సరఫరా జరుగుతుందని, అది కూడా అరకొరగా రావడంతో గ్రామస్తులు నీటికోసం అల్లాడుతున్నామని తెలిపారు. సత్యసాయి తాగునీటి కోసం పోలవరం గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఆ నీరు దొరక్కపోతే ప్రయివేటు వాటర్ ప్లాంట్ల వద్ద 20 లీటర్ల నీరు పది రూపాయలకు కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని, సత్యసాయి తాగునీటిని రెండు పూటలా సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ మహిళలు కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తొలిప్రాధాన్యత : డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాలకు పాల్పడే వారిపై నిఘా మరింత పెంచాలని, వారిపై హిస్టరీ షీట్స్ తెరవటంతోపాటు, అధిక సంఖ్యలో నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్ కుమార్ అన్నారు. ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదయ్యే కేసులు, ప్రాపర్టీ కేసులు, రికవరీ, దర్యాప్తు, మహిళలపై నేరాలు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై డిఐజి క్షుణ్ణంగా సమీక్షించారు. పోలీస్ సబ్ డివిజన్ వారీగా కేసుల పరిష్కారంలో పురోగతిని ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం, ఉదాసీనతతో వ్యవహరించొద్దని సూచించారు.

30న చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అన్నే భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. గోదావరి, కృష్ణ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం, భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 30వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల వద్ద, తహశీల్దార్ కార్యాలయాల వద్ద సామూహిక రాయబార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న మృత్యుంజయరాజు

విద్యార్థుల ప్రగతికి 'ఆణిముత్యాలు' దోహదం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

'జగనన్న ఆణిముత్యాలు' పథకం ద్వారా పదో తరగతిలో ప్రతిభా విద్యార్థులను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించి ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని స్థానిక జిల్లాపరిషత్ బాలుర పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షులు పచ్చిపాల మృత్యుంజయరాజు అన్నారు. శనివారం పదో తరగతి ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కొల్లేపర మోహనచంద్ర(552/600), మట్టపర్తి చరణ్‌సాయిపవన్(536/600), బోళ్ల దూండీమహేష్‌కుమార్(527/600)కు బంగారు, రజిత, కాంస్య పథకాలు, మెరిట్‌సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు లోవ కుమారి మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నగదు ప్రోత్సాహకాలున్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో రూ.లక్ష గెలిచే స్థాయికి జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాల విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని సూచించారు. ఇప్పటి నుండే ప్రణాళికలను ఏర్పరచుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ డి.జగదీష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు : సమాజం అభివృద్ధికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఇఒ రామారావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభా విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, మెడల్, సర్టిఫికెట్ అందించి సత్కరించారు.

ముదినేపల్లి : జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు వరం లాంటివని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వడాలి జెడ్‌పి హైస్కూల్లో జరిగిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పదోతరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు బహుమతి అందించారు. ప్రథమ స్థానం సాధించిన సోమల నితిన్‌ను సన్మానించి రూ.మూడు వేలు నగదు అందించారు. ద్వితీయ స్థానం సాధించిన ఎల్.నంది నికి రూ.రెండువేలు, తృతీయ స్థానంలో నిలిచిన లీలా అహల్యకు రూ.వెయ్యి నగదు అందచేసి విద్యార్థులను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి ఎం.నాగయ్య, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ పల్లి ఉమామహేశ్వరి, వైసిపి సీని యర్ నేత ఈడే వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం వి.ప్రభుదాస్ పాల్గొన్నారు.

19 నుంచి డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశం పొందడానికి ఈనెల 19వ తేదీ నుండి 24 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 26 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు తెలిపారు. నూతన విద్యా విధానం 2020లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 2023-24 నుండి అన్ని డిగ్రీ కళాశాలల్లో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఏలూరు ప్రభుత్వ కళాశాలలో 2023 -24 విద్యాసంవత్సరం నుండి బిఎ(హిస్టరీ మేజర్, ఎకనామిక్స్ మైనర్), బికాం (కామర్స్ మేజర్, కంప్యూటర్ అప్లికేషన్స్ మైనర్), బి ఎస్‌సి (జువాలజీ మేజర్, బోటనీ మైనర్), బిఎస్‌సి (మ్యాథ్స్ మేజర్, కెమిస్ట్రీ మైనర్) కోర్సులు అందుబాటులో ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా డిగ్రీ ప్రవేశాల ప్రచార కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిడిసి కార్యదర్శి ఇరదల రఘుబాబు, సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు బత్తిన మస్తాన్‌రావు, అధ్యాపకులు సిహెచ్.ఉదయలక్ష్మి, ఎం.రాంబాబు, ఎస్.పరమేశ్, ఎన్.కరుణ పాల్గొన్నారు. ఈ నెల 19వ తేదీ నుండి అన్ని పని దినాల్లో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి కళాశాలలో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని డిగ్రీలో చేరదలచుకున్న విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఆటపాకలో చెరువు తవ్వకాల నిలిపివేత

అనుమతుల్లేకుండా ప్రారంభించిన ఎంఎల్ఎ నాగేశ్వరరావు - చర్యలు చేపడుతున్నాం : డిఎఫ్ఒ

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరులంక గ్రామాలకు తాగునీటి వసతిని కల్పించేందుకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు నిషేధిత ప్రాంతంలో ప్రారంభించిన చెరువు తవ్వకం పనులను అధికారులు నిలిపివేశారు. అయితే కొల్లేరు సరస్సులోని భూములు సుప్రీంకోర్టు సాధికార కమిటీ ఆదేశాల మేరకు ఐదో కాంటూరు పరిధిలోకి చేర్చారు. ఈ భూముల్లో అడుగు పెడితే కోర్టు నిబంధనలు ప్రకారం బెయిల్ రాని కేసులు నమోదవుతాయి. అయితే శనివారం ఉదయం ఎంఎల్ఎ ఆటపాక గ్రామపెద్దలు, పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆటపాక, గోనెపాడు గ్రామాల సరిహద్దుల్లో సుమారు 20 ఎకరాల్లో చెరువు తవ్వేందుకు లాంఛనంగా పూజలు కూడా చేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వెళిఓల పనులను నిలిపివేశారు.



భూమిపూజ చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

చర్యలు తీసుకున్నాం : డిఎఫ్ఒ

ఆటపాక పక్షుల కేంద్రం సమీపంలో జరుగుతున్న చెరువు అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాం. రెండు పొక్లెయిన్లను సీజ్ చేసి, పలువురిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇదే క్రమంలో సమాధానం చెప్పేందుకు చాలానిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆగ్రహంతో 'ఆయనపై చర్యలు తీసుకున్నాం.. రాసుకోండి' అంటూ సమాధానం చెప్పారు. అయితే ఈ డిఎఫ్ఒ గతంలో పనిచేసిన చోట పలు ఆరోపణలు ఎదుర్కొని, ప్రభుత్వంలోని ఓ మంత్రి సిఫార్సుతో కొల్లేరుకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి కొల్లేరులో చెరువుల జాతర మొదలవుతోంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానాలు కొల్లేరు పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాలి.

టిడిపి ఆధ్వర్యాన యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ

పోలవరం: లక్ష్మీనారాయణదేవి పేటలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ప్రోద్బలంతో స్థానిక టిడిపి నాయకులు యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, వాణిజ్య విభాగ అధ్యక్షులు గుబ్బా రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇళ్ల సత్యనారాయణ, దాసరి రవి ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు అందజేశారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిక్కాల వెంకటేష్, కట్టవ వెంకటేష్, ఆవూరి చిన ధర్మరాజు, ఇళ్ల చినసత్యనారాయణ, జక్కు సత్యనారాయణ, జల్లేపల్లి జితేంద్ర, గ్రామ యువత పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పోలవరం

వింజరం గ్రామంలోని గోవిందరాజుల చెరువు, కొండ కాలువ, ఇసుక కాలువలు వర్షాకాలంలో నీరు పొంగి ప్రవహించే ప్రమాదం ఉండటంతో ఆ కల్వర్టును మైనర్ ఇరిగేషన్ పోలవరం సబ్ డివిజన్ డిఇఇ కె.వరప్రసాద్, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి శనివారం పరిశీలించారు. వర్షాకాలంలో ఈ కల్వర్టు ముంపునకు గురికావడంతో స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టాలని డిఇఇని ఎంపిపి కోరారు. అనంతరం పాత పోలవరం కడెమ్మ స్లూయిజ్ వద్ద జరుగుతున్న పూడికతీత పనులను డిఇఇ, ఎంపిపి పరిశీలించారు. వీరివెంట మైనర్ ఇరిగేషన్ సీనియర్ అసిస్టెంట్ ముంతా సుబ్బారావు, లస్కర్ చందు, సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఎంపిపి ఆర్.సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మందపల్లి పెద్దిరాజును ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పి, ప్రభుత్వం నుంచి ఇంటి లోన్ మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు, అల్లూరు సర్పంచి శీలం రామకృష్ణ, గంటా కోటేశ్వరరావు, చల్లగుళ్ల శ్రీకాంత్, దివి సతీష్, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని వెంకటాపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో మూడు తాటాకు ఇళ్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన మూడు బాధిత కుటుంబాలకు తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి రూ.30 వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభలపై ప్రజలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామ సభలను సక్రమంగా నిర్వహిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో గ్రామసభల నిర్వహణపై శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు గ్రామసభలే పునాది అని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ సభలకు తప్పనగా సరిగా హాజరై సమస్యలపై ప్రశ్నించాలన్నారు. ప్రశ్నించడం ద్వారానే గ్రామంలో సుపరిపాలన విజయవంతంగా సాగుతుందన్నారు. ఫలితంగా అన్నివర్గాల ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. యజమానులుగా గ్రామసభల్లో ప్రశ్నించినప్పుడే సేవకులుగా 29 శాఖలకు చెందిన అధికారులు గ్రామసభలకు హాజరై సమస్యల పరిష్కారానికి పనిచేస్తారన్నారు. అంతేకాకుండా పంచాయతీకి నిధులు ఎన్ని వచ్చాయి, దేనికి ఎంత ఖర్చు పెట్టారు అనేది వివరాలు అడిగి తెలుసుకోవచ్చని, జరిగిన పనులపై, జరగబోయే పనులపై చర్చించి తగునిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యతగల గ్రామసభలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే సభలకు హాజరు కాలేకపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభల నిర్వహణపై పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్లపాడు సర్పంచి చేబ్రోలు సుధారాణి, ఉప సర్పంచి జాన్సీరాణి, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షులు దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలు : కాంగ్రెస్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసగిస్తున్నాయని, హామీలు అమలు చేయకపోగా రకరకాల భారాలు మోపి దోపిడీ చేస్తున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు విమర్శించారు. శనివారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కో ఆర్డినేషన్ కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రజలను మోసగించిన టిడిపి, వైసిపిలకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు సరైన రీతిలో అమలు చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమని చెప్పారు.

ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిడి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పరిమిసాగర్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగ భరత్, పిసిసి సభ్యులు టిఆర్‌బి విటల్ కుమార్, నూజివీడు మండల అధ్యక్షులు పల్లెపాము ప్రసాద్, ముసునూరు మండల అధ్యక్షులు సూర్యదేవర ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ ఆంజనేయులు, చీకటి రాజు, శివశంకర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.పవన్, రామ్ సింగ్ పాల్గొన్నారు.

వికలాంగులకు ఎంఆర్ కిట్లు

ప్రజాశక్తి - పోలవరం

సర్వశిక్ష అభియాన్ కార్యాలయ ఐఇ కోఆర్డినేటర్ భాస్కర్ ఆధ్వర్యంలో వికలాంగ పిల్లల్లో ముఖ్యంగా బుద్ధి మాంద్యం కలిగిన పిల్లల్లో ఎంఆర్ కిట్లకు నలుగురు ఎంపికయ్యారని ప్రత్యేక ఉపాధ్యాయురాలు జి.యామిని తెలిపారు. ఈ ఎంఆర్ కిట్లను పోలవరం మండల విద్యాశాఖాధికారి బిబిఎస్.స్వరూప్ ద్వారా బుద్ధి మాంద్యత కలిగిన పిల్లల తల్లిదండ్రులకు శనివారం అందజేశారు. ఈ కిట్లు వారికి ఎంతగానో ఉపయోగపడతాయని, వారి మనో వికాసానికి దోహదపడతాయని ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ స్వరూప్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జి.యామిని, సిఆర్‌పి దామోదర్ ఉన్నారు.

బాదుడే.. బాదుడు..!

ప్రభుత్వ అసంబద్ధ, చట్టవ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజలపై పోలీసులను ఉసిగొల్పి నిర్బంధకాండ ప్రయోగించి, ఆపై లాఠీలతో బాదేస్తుండగా.. ప్రభుత్వం నేరుగా ఛార్జీల మోతతో పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులు పెడుతోంది..



పోలవరం పనుల్లో నాణ్యతాలోపంపై వార్తలు వెలువడటంతో ఆ పనుల పరిశీలనకు బయల్దేరిన టిడిపి నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని నిర్బంధించారు. మాజీ మంత్రులు దేవినేని ఉమ, జవహర్‌ను బుట్టాయగూడెం పోలీసు స్టేషన్‌లో నిర్బంధించగా పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తదితరులను వివిధ చోట్లకు తిప్పి, వాహనాలు మార్చి చివరకు స్వగృహానికి చేర్చారు. ఇప్పటికే సిఎం పర్యటనల సందర్భంలోనూ మీడియాను సైతం ఒకచోట ఉంచి ఫొటోలిస్తాం.. వివరాలిస్తాం కవరేజీ ఇవ్వండి అంటూ ప్రభుత్వం నిరంకుశ ధోరణి ప్రదర్శిస్తోంది. సిఎం భద్రతరీత్యా అని సరిపెట్టుకుందామంటే సాధారణ రోజుల్లోనూ ప్రాజెక్టు పనుల పరిశీలనకు ముందస్తు అనుమతి లేకపోతే మీడియాను సైతం అనుమతించడం లేదు. ఏదోవిధంగా వెళ్లినా ఇతర దేశాల్లోకి వెళ్లినట్లుగా నిరంతరం ఎవరోకరు అనుసరిస్తూ అటు వెళ్లొద్దని, ఇటు వెళ్లొద్దని ఆంక్షలు విధిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పనుల్లో నాణ్యతాలోపంపై పరిశీలనకు బయల్దేరిన టిడిపి నేతలను అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. అనుమతి తీసుకోకపోవడం వల్లే అడ్డుకున్నామని పోలీసు అధికారులు ప్రకటించారు. వాస్తవంగా అనుమతి కోరితే ఈ అధికారులు ఇస్తారా అనేది అనుమానమే. పనుల్లో నాణ్యతా లోపాలేమీ లేవని అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు అధికారులు సర్దిచెప్పుకునే ప్రయత్నం చేశారు. అదే నిజమైతే టిడిపి నేతలను ఎందుకు పనుల పరిశీలనకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారనే దానికి ఏఒక్కరి వద్దా సమాధానం లేదు.

అయితే ఇక్కడ కూడా టిడిపి గతంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించినట్లే ఇప్పుడూ పనులపైనే దృష్టి పెట్టి పోరాటాలకు సిద్ధమవుతుంది తప్ప ప్రాజెక్టులో జల సమాధి అవుతున్న నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిహారం, ప్యాకేజీ, పునరావాసం గురించి టిడిపి ప్రభుత్వ హయాంలో పట్టించుకున్న దాఖలాల్లేవు. పైగా బలవంతంగా కొన్ని గ్రామాలను ఖాళీ చేయించిన పరిస్థితి ఉంది. అయితే తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం సైతం అదే ధోరణి ప్రదర్శిస్తోంది. పైకి సానుభూతి మాటలు చెబుతున్నా కార్యాచరణలో సాయం అందించకపోగా వరద బారిన వదిలేసి 'పొమ్మనలేక పొగబెట్టిన' చందంగా వ్యవహరిస్తోంది.

చించినాడలో గోదావరి పెరుగులంక భూముల వ్యవహారంలోనూ ప్రభుత్వం తీరు అత్యంత జుగుప్సాకరంగా మారింది. 'నవ్విపోదురు నాకేటి సిగ్గు' అనే చందంగా ప్రభుత్వ పరువు బజారున పడుతున్నా మట్టి తవ్వకాల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. జిల్లా అధికారులు సైతం ప్రజాప్రతినిధుల ఒత్తిడో.. అధికారం అండగా ఉందనో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసుల రక్షణ నడుమ అక్రమ దందా సాగించడం వైసిపి పాలకులకే చెల్లిందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. రాజకీయంగా ఎదుగుదలలో ఎవరి సలహాలు తీసుకున్నామో.. ఎవరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగామో అనేది మరిచారో ఏమో సదరు అధికార పక్ష ప్రజాప్రతినిధులు కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలు వారి అహంకారపూరిత వైఖరికి నిదర్శనంగాను, అవగాహనారాహిత్యానికి ప్రతిబింబంగానూ ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దిగువస్థాయి నుంచి ప్రజాప్రతినిధిగా ఎన్నికైనా ప్రజల పక్షంగా లేకపోతే 'రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలే' అనే పరిశీలకుల వ్యాఖ్యానం రానున్న రోజుల్లో అధికారపక్షానికి తప్పదని అంతా చెబుతున్నారు. చలో చించినాడ పేరిట నిర్వహించిన సభకు సైతం పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. ఆపై భూముల పరిశీలనకు బయల్దేరిన నేతలను ప్రధానంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాసంఘాల నేతలను ఈడ్చుకుంటూ లాక్కెళ్లి వ్యాన్‌ల్లోకి ఎక్కించిన తీరు ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా లేదా అనే అనుమానం కల్గించింది. నేతలను తరలిస్తున్న వాహనాన్ని ఎక్కడికక్కడ సిపిఎం, టిడిపి శ్రేణులు అడ్డుకోవడంతో పోలీసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆచంట, మార్టేరు, తణుకు మీదుగా తాడేపల్లిగూడెం తీసుకొచ్చి విడిచిపెట్టారు. ప్రభుత్వ విధానాలు, పోలీసులు దౌర్జన్యానికి వ్యతిరేకంగా ప్రజలు రోడ్డెక్కిన తీరు ఇప్పటికైనా పాలకులు తన పంతం వీడి మట్టి తవ్వకాలను ఆపాలని చెప్పకనే చెబుతోంది.

ఇక ప్రభుత్వం నేరుగా పేదలపై బాదుడుకు తెగబడింది. విద్యుత్ ఛార్జీల మోత, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు భారాలను గుట్టుచప్పుడు కాకుండా ప్రజలపై మోపుతోంది. విద్యుత్ తీగను తాకితే కొట్టే షాక్ ఇక బిల్లును ముట్టుకుంటేనే కొడుతోందని ఈ నెల విద్యుత్ బిల్లులు అందుకున్న వినియోగదారులంతా లబోదిబోమంటున్నారు. ఎన్నికల వేళ కచ్చితంగా ప్రభుత్వం తీరు మారకపోతే జిల్లావాసులు అధికారపక్షానికి షాక్ ఇవ్వడం ఖాయమని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

స్తోమత లేకపోతే ఉచితంగా న్యాయవాది

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేనివారికి కోర్టు ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. చింతలపూడి సబ్‌జైలును ఆయన శనివారం సందర్శించారు. అనంతరం కోర్టులో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా పిల్లలు బడికి వెళ్లకుండా పనులకు వెళ్తుంటే వారిని గుర్తించి బడికి పంపించాలన్నారు. ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు బడికి వెళ్లని పిల్లలను గుర్తించి కోర్టుకు తెలపాలని, అలాంటి పిల్లలను సంబంధిత డిపార్ట్‌మెంట్ల ద్వారా హాస్టళ్లలో జాయిన్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిపి సామయ్య, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ నామినేటెడ్ మెంబర్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కృష్ణకు రామారావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన టిడిపి మహానాడుకు వెళ్లి వస్తూ ప్రమాదానికి గురైన టిడిపి కార్యకర్త కృష్ణకు ఆ పార్టీ రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆకుమర్తి రామారావు ఆర్థిక సాయం అందించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్త కృష్ణ ఇంటికి వెళ్లిన ఆకుమర్తి రామారావు కృష్ణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆకుమర్తి రామారావు మాట్లాడుతూ కార్యకర్తలకు టిడిపి ఎల్లప్పుడూ తోడూ ఉంటుందన్నారు. కృష్ణ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేవరకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి కార్యకర్తలు చేను ప్రసాద్, బేతాళ మురళీ, కొత్తూరు సత్తిబాబు, రాంబాబు పాల్గొన్నారు.



హర్షితను సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్

హర్షితకు కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్ సత్కారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన భుక్యా హర్షితను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సత్కరించారని విద్యార్థిని కుటుంబీకులు శనివారం విలేకరులకు తెలిపారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన భుక్యా రాజానాయక్, దేవి దంపతుల కుమార్తె భుక్యా హర్షిత 2022-23 విద్యా సంవత్సరంలో బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతిలో 530 మార్కులు సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన హర్షితను కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ చేతుల మీదుగా సన్మానించి సర్టిఫికెట్ అందించారని తెలిపారు. హర్షితను గ్రామానికి చెందిన భుక్యా గోపయ్య సత్యం ఫౌండేషన్ సిఇఒ భుక్యా వేణుగోపాల్ అభినందించారు.

టిటిడికి 12 టన్నుల కూరగాయలు వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి 12 టన్నుల కూరగాయలు వితరణ అందిస్తున్నట్లు రైతు సత్యనారాయణ తెలిపారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ రైతుల సహకారంతో ప్రతి నెల కూరగాయలు పంపేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం వాహనాన్ని పంపిన తిరుమల తిరుపతి దేవస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

చిన్నారుల తల్లులకు డయేరియాపై పూర్తి అవగాహన కల్పించాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కె.అబ్రార్ హుస్సేన్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో శనివారం ఐడిసిఎఫ్ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు డయేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ భరత్ కుమార్, ఆరోగ్య కార్యకర్త నర్సారా, ఆశాలు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీ రఘునాథ స్వామి ఆలయానికి చెందిన పోలవరపుపల్లిలో ఆర్ఎస్ నెంబర్ 161లో గల 3.09 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఒక ఏడాదికి రూ.70 వేలు పాటగా ఖరారు చేసినట్లు ఆలయ ఇఒ కొండలరావు తెలిపారు. గతంలో కంటే ఈసారి రూ.24,800 అదనపు ఆదాయం లభించిందన్నారు. రఘునాథస్వామి ఆలయానికి అనుబంధ ఆలయాలైన సోమేశ్వర, వీరభద్రస్వామి ఆలయాల్లోని హుండీలను లెక్కించారు. గతేడాది మే 25 నుంచి ఈ నెల 16 వరకు 387 రోజులకు రూ.1,88,333 ఆదాయం చేకూరిందన్నారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది, భక్తుల సమక్షంలో నిర్వహించామని తెలిపారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని సింగన్నపల్లి పునరావాస కాలనీలో శనివారం గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పునరావాస గ్రామాలకు తరలివచ్చి ఏడు సంవత్సరాలు కావస్తుందని, ఈ ఏడేళ్లలో గ్రామ దేవత గంగానమ్మ విగ్రహానికి అధికారులు ఆలయం నిర్మించి ఇస్తామని ఇప్పటివరకూ నిర్మించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్ల కాలంలో రెండు సంవత్సరాలకు మాత్రమే జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీ నృత్యాలతో, సంస్కృతి, సాంప్రదాయాలతో గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ రెండు రోజుల్లో చుట్టుపక్కల గిరిజన గ్రామాల ప్రజలు భారీగా తరలి వస్తున్నారని కమిటీ సభ్యులు చెప్పారు.

నేరాలు - ఘోరాలు

గోవులను తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

నూజివీడు రూరల్: నాలుగు డిసిఎం వాహనాల్లో తరలిస్తున్న 180 ఆవులను మండలంలోని లీలానగర్ అడ్డరోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున పోలీసులు రక్షించారు. ఆవులను గుంటూరు గోరక్షణ శాలకు తరలించినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. ఆవులను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నూజివీడు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయాలపాలైన ఘటన పట్టణంలోని రాజీవ్‌సర్కిల్ వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బోరవంచకు చెందిన తాడేపల్లి నవీన్(19) బైక్‌పై వెళ్తూ నూజివీడు పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన నవీన్‌ను స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ తరలించారు.

మామిడి తోట కంచెకు నిప్పు

నూజివీడు రూరల్: మండలంలోని వెంకటాయపాలెం గ్రామ పరిధిలోని మామిడితోట చుట్టూ ఉన్న కంచెకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగుతూ గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నూజివీడు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

క్రమశిక్షణ, నాణ్యమైన విద్య 'అమలోద్భవి' సొంతం

స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్యాబోధనలో మార్పులు చోటు చేసుకుంటున్న సందర్భంగా వాటిని విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వాటికి అనుగుణంగా అమలోద్భవి ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో విద్యాబోధన ఉంటుందని స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి అన్నారు. విద్యా సంవత్సరం ఆరంభం దృష్ట్యా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మంచి విద్యతో పాటు సమాజంలోని అంశాలను జోడిస్తూ విద్యాబోధనలో తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ స్కూల్ ఏర్పాటు చేశామని తెలిపారు. 34 ఏళ్ల క్రితం రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్‌సిఎం) ఏలూరు పీఠం ఆధ్వర్యంలో 1990లో 15 మందితో పాఠశాలను ప్రారంభించగా, ప్రస్తుతం 1050 మంది విద్యార్థులు చేరారన్నారు. నాలుగు అంతస్తులతో కార్పొరేట్ పాఠశాలలో కూడా లేని సౌకర్యాలతో ఏలూరు నగర నడిబొడ్డున అందంగా కొలువు తీరింద న్నారు. బిఇడి, డిఇడి పూర్తి చేసిన నిష్ణాతులైన బోధన సిబ్బంది పాఠశాలలో బోధన అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థినులకు ప్రత్యేక వసతి గృహ సదుపాయం ఉందన్నారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించారు. ఇక్కడ చదివిన శిరీల్ ప్రకాష్ 581 మార్కులు, యు.మోహిత్ 567, పి.జాహ్నవి 563, హాబీబర్ రెహ్మాన్ 558, భావేష్ 556, జ్ఞాన రమ్యశ్రీ 551, పి.లక్ష్మీశ్రీనివాస్ 550, బి.మైథిలి 549, షేక్ హసీనా 546, కె.అస్సిస్సి ప్రభాకర్ 545 మార్కులు సాధించి ఔరా అనిపించారన్నారు. తమ స్కూల్లో చేరే విద్యార్థులకు అన్ని రంగాల్లో రాణించే విధంగా అన్ని నైపుణ్యాలతో కూడిన విద్యను ప్రణాళికా బద్ధంగా, అనేక ప్రత్యేక కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా చదువు ఉండాలన్న లక్ష్యంతో చక్కని బోధన అందిస్తున్నామన్నారు. తమ స్కూల్లో చదివే విద్యార్థులు భవిష్యత్తులో తమ కాళ్లపై తాము నిలబడేలా తయారు చేయనున్నామని తెలిపారు.



ట్రిపుల్ ఐటికి అనుగుణంగా బోధన

సిస్టర్ రోష్మి, స్కూల్ ప్రిన్సిపల్



మా స్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ విద్యకు అనుగుణంగా బోధన సాగిస్తున్నాం. ఇందుకు కింది స్థాయి తరగతుల నుంచే ప్రణాళిక రూపొందించాం. ఒక్కో ఏడాది ఉన్నత పాఠశాల తరగతుల వారిగా అభివృద్ధి చేస్తున్నాం. గతేడాది ఉన్నా యుకెజి తరగతి విద్యార్థులతోనే ఈ ఏడాది ఒకటో తరగతి ప్రారంభిస్తున్నాం. క్రమేపి పదో తరగతి వరకు పాఠశాల తరగతులు ఉంటాయి. కొత్తగా చేరే వారికి అవకాశం కల్పిస్తున్నాం.

ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలి



భీమడోలులో విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - భీమడోలు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పలు సౌకర్యాల కల్పన, నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధన గల ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగ, భీమడోలు సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ కోరారు. భీమడోలు ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుకల పంపిణీ, భీమడోలు హైస్కూల్‌లో పాఠశాల స్థాయి ఆణిముత్యాలు సన్మాన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భవానిరంగ, సునీత్‌మాన్‌సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం భీమడోలు హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పదో తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన కె.రితిక, ఎల్.వినూత్న, వి.పవన్‌లకు ఆణిముత్యాల ప్రోత్సాహకాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఆణిముత్యాలుగా గుర్తింపు పొందిన ముగ్గురికి వారి సాధించిన మార్కుల ఆధారంగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.వెయ్యి నగదు పురస్కారాలు త్వరలో అందిస్తామని తెలిపారు.

ముసునూరు : ప్రతివిద్యార్థి చదువులో ముందంజలో ఉండాలంటే క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ముసునూరు జెడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సునీలారెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మండల కేంద్రమైన జెడ్‌పి పాఠశాలలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యం కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. మొదటి స్థానంలో నిలిచిన అనితకు రూ.మూడు వేలు, రెండో స్థానంలో నిలిచిన కె.అర్చనకు రూ.రెండు వేలు, మూడో స్థానంలో నిలిచిన శాలెంరాజుకు రూ.రెండు వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, టి.రంగారావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రత్నమాల పాల్గొన్నారు.

చింతలపూడి : అందరికి నాణ్యమైన విద్యను అందించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారని చింతలపూడి ఎంపిపి రాంబాబు అన్నారు. సుబ్బరాజు హైస్కూలు విద్యార్థులకు శనివారం జగనన్న విద్యాకానుక కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చేస్తున్నారన్నారు. విద్యార్థులకు అవసరమైనవి జగనన్న విద్యాకానుక ద్వారా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, సిటి మెడికల్ దుర్గారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు



పంచాయతీ సిబ్బంది, కార్మికులకు మజ్జిగ, గ్లూకోజు అందిస్తున్న సర్పంచి

వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బంది, కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు నూతన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.ఠాగూర్ తెలిపారు. దీనిలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది కార్మికులకు మజ్జిగ, గ్లూకోజు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ ఆధ్వర్యంలోని పంచాయతీ పాలకవర్గం ఈ మేరకు అనుమతించిందని ఆయన తెలిపారు. వేసవి తీవ్రత తగ్గేంతవరకు కార్యక్రమాన్ని కొనసాగిస్తామని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగరాజు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొన్న గ్రామపంచాయతీ కార్మికులు శ్రీను శనివారం కుటుంబ సభ్యుల సహకారంతో భీమడోలు తాగునీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

డ్రెయినేజీలో పూడికతీత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్ సమీపంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయినేజీలో శనివారం పూడికతీత పనులు చేశారు. చెత్తాచెదారంతో మురుగు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాప్తి చెందిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశాలకు డ్రెయినేజీలో పూడిక తీశారు.

పాఠశాలల్లో డిజిటల్ టెలివిజన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



గొల్లపల్లి హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ టెలివిజన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ టెలివిజన్లు ఏర్పాటులో భాగంగా మండలంలోని గొల్లపల్లి శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏడు డిజిటల్ టెలివిజన్‌లు ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధికారాణి తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేసుకోవడానికి డిజిటల్ టెలివిజన్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యులు ఎం.లెనిన్, విద్యా కమిటీ ఛైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, పూర్వవిద్యార్థి మారేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు అంగన్‌వాడీ విద్య తప్పనిసరి

ప్రజాశక్తి - మండవల్లి



జన భాగిదారి కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సిబ్బంది

అంగన్‌వాడీ చిన్నారులను జన భాగీదారి కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని మండవల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కల్పవల్లి అన్నారు. గన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారి కార్యక్రమం ద్వారా చేయదగిన కార్యక్రమాలపై తల్లిదండ్రులకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కల్పవల్లి మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపించాలన్నారు. అక్కడ చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు క్రమశిక్షణతో కూడిన ఆటపాటలు మంచి నడవడిక అలవడుతుందన్నారు. అంతేకాకుండా పౌష్టికాహారం చిన్నారుల్లో శారీరక, మానసిక అభివృద్ధి బాగుంటుందన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అలాంటివారు శిక్షార్హులవుతారన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలపై, అందిస్తున్న పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వి.రోజా, ఎఎన్ఎం పద్మావతి అంగన్‌వాడీ కార్యకర్తలు జి.విజయలక్ష్మి, సిహెచ్.నాగమల్లేశ్వరి, భువనేశ్వరి, మహిళా పోలీస్, ఆశా వర్కర్లు, వాకర్లు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాల అడ్డగింపు

ప్రజాశక్తి - పోలవరం



మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

మండలంలో కొత్తూరు చెరువు మట్టిని రాత్రీపగలు తేడా లేకుండా లారీలతో యథేచ్ఛగా తరలించడాన్ని అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మట్టి అక్రమ తవ్వకాల సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ బి.సుమతి ఆదేశాలతో పోలవరం సచివాలయం-1 విఆర్ఒ ప్రసాద్ కొత్తూరు చెరువు ప్రాంతానికి వెళ్లి మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో వారంతా అక్కడనుంచి ఉడాయించారు. ఐదు రోజులుగా రాత్రీపగలు ట్రాక్టర్లతో భారీ స్థాయిలో మట్టిని తరలించినట్లుగా అధికారులు గుర్తించారు. దీనిపై ఇరిగేషన్ జెఇ సురేష్‌ని వివరణ కోరగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడిలో రైతులకు పల్లపు ప్రాంతాల పొలాలను మెరక చేసుకోవడానికి అధికారుల అనుమతితో పూడిక మట్టి తరలించడానికి అనుమతులు ఇచ్చినట్లుగా తెలిపారు. అయితే తరలిస్తున్న మట్టి పంట పొలాలకు కాక ఇటుక బట్టీలకు తరలించడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలవరం మండలంలో ఎంతోమంది రైతులు తమ పొలాలను మెరక చేసుకోవడానికి మట్టి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి చెరువు మట్టిని తరలించడం పట్ల పలువురు పోలవరం రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు లంచాలకు పాల్పడి మట్టి రవాణా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ హెచ్చరించారు.

శ్మశానవాటిక మెరక పనులు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వర పరిష్కారం చూపడంలో గ్రామపంచాయతీ ఎప్పుడూ ముందుంటుందని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. స్థానిక శ్మశానవాటికలో ఉన్న పల్లపు ప్రాంతాలను శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో మట్టి పోసి జెసిబితో లెవెలింగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికే పంచాయతీ ఉందన్నారు. శ్మశానవాటిక పల్లంగా ఉండడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించినట్లు సర్పంచి తెలిపారు. గ్రామంలో నెలకొన్న జఠిలమైన అనేక సమస్యలను పంచాయతీ బోర్డు మెంబర్లు, గ్రామపెద్దలు, గ్రామస్తుల సహాయ సహకారంతో పరిష్కరించుకున్నట్లు తెలిపారు. గ్రామానికి ఉత్తమ పంచాయతీగా అవార్డు దక్కిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో ప్రజలకు సత్వర సేవలందిస్తామని ఆయన తెలిపారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించడంలో ప్రజలు కూడా పంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు పుట్టి మీనా కుమారి, ఉప సర్పంచి కుందేటి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు రాంబాబు, పాలకవర్గ సభ్యులు కార్యదర్శి రత్నకుమారి పాల్గొన్నారు.